



# వర్షం

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

వర్షం దబాయించి జబర్దస్తీ చేస్తోంది.

సాయంకాలం అవుతోంది. మబ్బులవల్ల, మామూలుకంటే, చీకటి ఎక్కువగా ఉంది. రోడ్డుపక్క కమ్మలపాక—టీ దుకాణంలో చీకటి చిక్కగా ఉంది. అడివిపాలెంనుంచి వచ్చి తన దుకాణంలో చిక్కుకుపోయిన సీటిబాబుని ఉద్దేశించి,

"మూడ్రోజులకొకని ఒగ్గదీ వరసం" అన్నాడు దుకాణంవాడు. ఒగ్గితే సెవి కదవా యిస్తానన్నాడు.

బల్లమీద దిగులుపడి కూర్చుండిపోయేడు సీటిబాబు అనబడే పురుషోత్తం.

"స్టేషన్‌కి కదు బాబూ ఎళ్లాలన్నావు?" ఆకాశం మెరుపుతో చీల్చుకొంది.

"అవును."

"అబ్బో! ఎక్కడ, రోండుకోసులుంది!" పిడుగుపడ్డట్టుగా ఉరిమింది.

"ఏఁటిఁటి?"

"రోండుకోసు లుందయ్యా బాబూ! బొగ్గులకోసం పెద్రోజ్ని అక్కడికి తగిల్నాను. సదువుకోనోడుగాని కూకరికి. రోండుకోసులుంది" అది రెండువేలమైళ్ళ దూరం అన్నట్టుగా చెప్పేడు దుకాణంవాడు.

"బస్సు దొరకదా?" అని హీనస్వరంతో అడిగేడు పురుషోత్తం.

"ఈ వొరసంలో బస్సు రాగల్దా? ఎక్కటి సీకు? ఈ తప్పవేరాదు. మాడ్రోడు నడిసే ఎళ్ళాడు" పురుషోత్తానికి కొంచెం గాభరా వేసింది. అత్యవసరమైన పనిమీద అతను [illegible] వెళ్ళవలసి ఉంది. మూడు రోజుల లోపల అక్కడికి వెళ్ళాలి అంటే మరో రెండుగంటల్లో అతను స్టేషన్ చేరుకోవాలి. బస్సురాదుట. బళ్లు కనిపించవు. వర్షం చూస్తే పెను ప్రళయంలా ఉంది.

"నేను కలకత్తా వెళ్ళాలి."

"ఏవూరూ?"

"కలకత్తా"

అబ్బో, శానా దూరఁవేఁ! అక్కడి కెళ్ళాల నువ్వు?"

"అవును"

"ఎళ్ళలేవు"

చాలా ఖచ్చితంగా చెప్పేడు దుకాణంవాడు. దిగులుపడి కూర్చుండిపోయేడు పురుషోత్తం. కత్తుల్లా మెరుపులు మెరుస్తున్నాయి. కొండలు బద్దలయినట్టు ఉరుములు ఉరుముతున్నాయి. శివాలెత్తి గాలి పరిగెడుతోంది. పగపట్టినట్టుగా వర్షం తెగపడుతోంది. చీకటిపట్టిన పాకలో, కొత్తపంట్లాం, కొత్త చొక్కా, కొత్తజోళ్ళు బాగా కనిపిస్తున్నాయి. ఆ మూడూ పురుషోత్తం వేసుకున్నాడు. అతన్ని బాగా చూడాలి అంటే దీపం వెలిగించి చూడాలి. అతను చక్కనివాడా? ఒప్పుకోనివాళ్లు తక్కువ. అతని నడుంమాత్రం చక్కగా సన్నగా ఉంటుంది. అతను సింహమధ్యముడే కాని సింహంలా ఉండడు. అతని పదిహేనోయేట "ఇరవయ్యేళ్లుంటవా?" అని చాలామంది అనుకొనేవారు. దుకాణంవాడిని ఆ సమయంలో అడిగితే "నలభై దగ్గిరుంటవా" అని అనగలడు. పురుషోత్తం పాతికసంవత్సరాల క్రితం పుట్టేడన్న సంగతి, ఆ పుట్టుక తెలిసినవాళ్ళకి తప్ప మరొకరికి తెలియదు. అతను ఎదగని పడ్డలా ఉండిపోయేడు.

ఆ సమయంలో ఆ దుకాణంలో దూరందుడు అతగాడు ఆ ముందురోజు బయల్దేరేడు. పయనమువసం కలకత్తాకి పయనమయేడు. అంతలో అతని మేనమామ గాలిధూళిలా వచ్చిపడ్డాడు. ఆ మేనమామ అందరికీ ఉచితంగా సలహా లివ్వగలడు; అవలీలగా పనులు పురమాయించగలడు. అతగాడు వచ్చిపడి "నీకు పెళ్ళి కావాలనే సంగతి నీకేమైనా తెలుసా?" అని పురుషోత్తాన్ని ప్రశ్నించి టకాయించేడు. టకాయించి "వెళ్ళువెళ్ళు. మంచిది, వయసుది, డబ్బుది, అడివిపాలెంలో మున్సబుకూతురుంది. పిల్లని చూసేసి అలా కలకత్తా వెళ్ళిపోవొచ్చు. వెళ్ళు వెళ్ళు. పెళ్ళిమాడు" అని మేనల్లుణ్ని వెంట తరిమేడు. వాస్తో చేతిలో పెద్దసంచీ పట్టుకొని అడివిపాలెంలో బంధువులింట్లో ప్రత్యక్షమై సాయంకాలం మున్సబుగారింట్లో కొత్తబట్టల్లో పెళ్ళికూతురిముందు ప్రత్యక్షమయేడు పురుషోత్తం. ఆ పిల్ల తన చూపుతో అతనికో చిక్కుప్రశ్న వేసింది.

"మునిసీబు" గారిది పాతకాలపు పెంకుటిల్లు. లోపల వరండాలో చాపమీద కూర్చొబెట్టేరు పెళ్ళికుమార్తెని. ఆ పిల్ల ముఖంవేసుకొని కూర్చొంది. పక్కనే వాకిట్లో తులసికోటపక్క దండెంమీద తెల్లచీర ఒకటి ఆరవేసి ఉంది. వాకిట్లో తోమిన ఇత్తడి గిన్నెలు తడితో మెరుస్తున్నాయి. ఇంటివెనక మామిడి చెట్టొకటి చీకటిగా అనుపచ్చగా కనిపిస్తోంది. దాని పక్కనే కొబ్బరి చెట్టొకటి నిటారుగా




# ★ వర్షం ★

ఠీగా గంభీరంగా మామిడిచెట్టుకోసం ప్రాణాలివ్వడానికి సిద్ధంగా నిల్చొంది. అస్తమించడానికి తటపటాయిస్తూ దూరాన్న సూర్యుడు ఆకాశంలో అవతల గుమ్మం దగ్గర నిల్చున్నాడు. అంతలో గదితలుపులన్నీ గప్పున తెరచి ఆకాశమంతటా కుంకాన్నెవరో కుమ్మరించేరు. అంతట, చెట్టున మామిడిచిగుళ్ళు, చెట్టున కొబ్బరి కొమ్మలు సంతోషంతో మూగనవ్వు నవ్వేయి. ఆరవేసిన తెల్లచీర వెలుగుని వరాండా అంతటా ఎర్రగా గుప్పున వెదజల్లింది. మెరిసే ఇత్తడిగిన్నెలు రాగిరంగు కలుపుకొని బంగారంలా మెరిసేయి. తులసి కోటలో తులసి మొక్క నర్తకిలా, నిల్చొంది.

దీపపు వెలుగున దేవీవిగ్రహంలా కనిపిస్తోంది పెళ్ళికూతురు. ఆమె తల కొంచెం దించి, రెప్పలు కొంచెం పైకెత్తి, పురుషోత్తాన్ని నిదానంగా పరిశీలనగా చూసింది. ఆమెకళ్ళు విశాలంగా స్వచ్ఛమైననీటితో నిండిన తటాకాల్లా ఉన్నాయి. మూరుమూల కుగ్రామంలోనే ఉన్నప్పటికీ ఆ తటాకాలు మెరిసే చుక్కల్నీ, వెలిగే చంద్రుణ్ణీ, మండే సూర్యుణ్ణీ కూడా సుస్పష్టంగా చూడగలవు. అవి చాలా దూరం చూడగలవు.

ఏవేవో ప్రశ్నలువేసి కూతురిచేత జవాబులు చెప్పిస్తోంది తల్లి. ఆపిల్ల సన్నంగానే మాట్లాడుతోందిగాని, గుహలో మాట్లాడినట్టుగా గంభీరంగా మాట్లాడుతోంది. ఇంటర్వ్యూ ముగిసేక పురుషోత్తం లేచి నిల్చున్నప్పుడు, ఆమె చాపమీద కూర్చొనే అతణ్ణి నిదానంగా మరోసారి బరువుగా రెప్పలు కొంచెం పైకివంచి అతణ్ణి చూసింది. చూసి, నెమ్మదిగానిల్చొని లోనికి వెళ్ళిపోయింది. ఆమెచూపు అతన్లో ఏదో అలజడి పుట్టించింది. కాని అతని కేమీ సరిగా అర్థం కాలేదు.

మర్నాడు బంధువులింట్లో మధ్యాహ్నం భోజనంచేసి రెండెడ్లబండి ఎక్కి రోడ్డు జంక్షన్‌కి బయల్దేరేడు. మధ్యాహ్నం ఒంటిగంటయింది. మువ్వలు చప్పుడుచేస్తూ ఎద్దులు ముందుకి సాగేయి. దార్లోనే పెన్నమున్సబు గారింటిని, బండి దాటుతూండగా ఆ అమ్మాయి ఎందుకోసమో వీధిపంచలోకి వచ్చి బండీ చూసి ఇంట్లోకి వెళ్ళిపోకుండా, అక్కడే ఆగి, గుమ్మాన్ని ఓచేత్తో ఆనుకొని నిశ్చలంగా నిల్చొని అతణ్ణి నిశ్చలంగా చూసింది. బండి ముందుకి సాగిపోయింది. ఆమె దూరాన్న ఉండిపోయింది. కాని ఆ చూపు అతణ్ణి వెంట తరుముతోంది. మరోవిధంగా చెప్పాలంటే, ఆ చూపు

అతన్లో గోతులు తవ్వుతోంది. కొన్నాళ్ళ క్రిందట పురుషోత్తం జబ్బుపడి ఆస్పత్రికి వెళ్ళేడు. అప్పుడతను చాలా నీరసపడి సిక్కిపోయున్నాడు. ఆస్పత్రిలో డాక్టర్ల వెనక నుంచి ఓ నర్సు ముందుకొచ్చి "ఇలారా" అని అతణ్ని తూకపు మెషీను దగ్గరకి తీసుకు వెళ్ళింది. తీసుకువెళ్తూ తనని ఆమె చూడ్డం అతను గమనించేడు. ఆమె చాలా లేతగా ఉంది. రోగుల బాధలకి బాగా అలవాటుపడి పోగా ఆమె ఇంకా అమానుషంగా తయారవలేదు. ఆమె కళ్ళు చాలా చిన్నవి. ఆమె చూపులో అర్థం అతనికి తూకంమెషీను చూసేదాకా బోధపడలేదు. దాన్ని చూసేక "ఓహో! ఈమె నాబరువెంతో అంచనా కడుతోంది" అనుకున్నాడు. మెషీన్ మీంచి అతను దిగిన తరువాత ఆమె జాలిగా చూసి, హెచ్చరికగా నవ్వి, "మరేం భయంలేదు. ధైర్యంగా ఉండు. నిమిషంలో నయమవుతుంది జబ్బు" అని హుషారిచ్చింది. కృతజ్ఞత ఎలా తెలియజేయాలో తెలియక అతనప్పుడు కంట తడిపెట్టేడు. బండిలో కూర్చొని వెళ్తుంటే ఆ లేత నర్సెందుకోగాని గుర్తొచ్చింది పురుషోత్తానికి. దూరంలో నల్ల కొండలు, ఇవతల కొబ్బరితోటలు, పక్కన పచ్చని చేలు, పైన తెల్లటి మేఘాల చాందినీ, అంతా అలా చూస్తోనే అతడు ఆలోచనలో పడిపోయేడు. నేను సరియైన బరువులేనా? అని ఓసారి అనుకున్నాడు. కాని అతనికేమీ సరిగా అర్థంకావడంలేదు. తడికర్రకి నిప్పంటనట్టుగా, అతని మనసు రాజుకోడంలేదు. బండి తాజాగా వెళ్తోంది. "ఒహోయ్! హోయ్ హోయ్" మంటూ బండీవాడు ఎడ్లని ఆపేటప్పటికి తుళ్ళిపడి, బండిలోంచి దిగేడు పురుషోత్తం. ఆ సమయంలో ఎక్కడో ఆకాశం దద్దరిల్లింది. తోటల్లో గాలి గలగలమంది; రివ్వురివ్వుమంది. పురుషోత్తం ఆకాశంకేసి చూసేడు, తెల్ల మబ్బుల్ని గాలి తుడిచిపారేసింది. ఓ పక్క నల్లమబ్బులు, లావాలా, పెనుగడ్డలా పెల్లుబికి, వాహినిగా విజృంభించి ముందుకొస్తున్నాయి.

నాటురోడ్డూ ట్రంకురోడ్డూ కలిసేచోట, రోడ్డుపక్క, అధికారిలా నిల్చున్న చింత చెట్టు ఈదురుగాలికి తల విసిరి ఆకాశాన్ని ఎదిరిస్తోంది. చెట్టుకింద కమ్మలపాక చలిగాలికి ముసలమ్మ వణికినట్టు వణుకుతోంది. అంతలోనే మబ్బులు ముంచుకొచ్చేయి. ఎండవేడికి పలకమీదినీరు మాయమైనట్టు ఎండంతా కూడా చూస్తోండగా మాయమయింది; పొలాలమీద మబ్బులనీడ ప్రవాహంలా పరిగెట్టింది.

బండివాడు గాలినీ ధూళినీ బూతులు తిడుతూ బండిని మళ్ళించి మొత్తాలమీదికి వెంగున ఎగిరేడు. ధూళిని చీలుస్తూ ఎడ్లు దౌడుతీసేయి. పురుషోత్తం, ఎదురుగా ఉన్న కమ్మలపాకలోకి దూరేసరికి వర్షం దడ దడలాడుతూ దిగింది. జోరుగా వీస్తోన్న గాలి మరికొంత జోరుచేసేసరికి, ప్రవాహం ఒక్కసారిగా పల్లానికి దిగినట్టు, వర్షపుధార పాకని ముంచేసి హోరుమంటూ ముందుకు పోయింది.

కమ్మలపాక 'టీ' దుకాణంలో బల్లమీద గంటపైనుంచీ కూర్చున్నాడు పురుషోత్తం. 'టీ' బల్లమీద గళాసులు పనిలేక పడున్నాయి. కెటిల్ వంటిదొకటి పొయ్యిమీద పడుక్కుంది. పొయ్యిలో నిప్పు చల్లబడిపోతోంది. దుకాణం అంతా తీరుబాటుగా ఉంది. టీ చెయ్యడం తనపని కానట్టుగా ముక్కాలిపీటమీద ముసలిపిల్లిలా కూర్చున్న దుకాణంతాత, ఆరిపోయిన చుట్టని రెండు పీల్పులు పీల్చి, అంటించకుండా దాన్ని టీ బల్లమీద పెట్టి, "ఏవూరు బాబూ మన్ది?" అని పురుషోత్తాన్ని మొదటి ప్రశ్నగా అడిగేడు. తరువాత వరసగా, నెమ్మదిగా— కమ్మలమారునుంచి వానజల్లుకి ఒకటీ ఒకటీగా నీటిబొట్లు తాజాగా కిందికి దిగినట్టు— ప్రశ్నల్ని వరసగా దింపడం ప్రారంభించేడు. జవాబివ్వకపోతే ఏం కొంపమునిగిపోతుందో అన్నట్టు వాటన్నింటికీ పురుషోత్తం జవాబిస్తున్నాడు.

అన్నీ తెలుసుకుని, ఆఖరికి, నువ్వువెళ్ళదల్చుకున్న చోటుకి వెళ్ళలేవు అని ఖచ్చితంగా పురుషోత్తంతో చెప్పేసి అందుగురించి సంతృప్తిపడి నవ్వుకున్నాడు దుకాణంతాత.

పైన వర్షం జోరుచేస్తోంది. గాలి గీపెడుతోంది. ఆకాశాన్ని మెరుపులు చీలుస్తున్నాయి; ఉరుములు బదులుకొడుతున్నాయి. కొండలన్నీ వానతాకిడికి మొండికెత్తి నిల్చున్నాయి. చెట్లన్నీ తిరగబడుతున్నాయి. దుకాణంలో పొయ్యిలో నిప్పుకి గాలి అందడంలేదు. మీదనుంచి వురిసేనీరుమాత్రం కెటిల్ మీంచి జారి నిప్పుల్లో ఇంకుతోంది.

నవ్వినవ్వుని మానినగడ్డంలో మాయంచేసేసి "బొగ్గులకెళ్ళేడు. వుత్రోడింకా రానేదు బాబూ. ఎక్కడుండిపోనాడో ఏటో" అన్నాడు దుకాణం తాత.

'అయితే బస్సు రాదంటావా?' అన్నాడు పురుషోత్తం.

'ఆమాటకొస్తే రెయిల్ గాడీ వేరాదు. ముండమోపిబస్సుకి సెక్కటి!?" అని, ప్రపంచమంతా ఆవిధంగా వర్షంవల్ల స్తంభించిపోయినందుకు, హర్షం వెలిబుచ్చేడు దుకాణం తాత.

గాలికీ వానకీ పాకమీద పాములు జారినట్టుగాచప్పుడౌతోంది. ట్రెయిన్ రావడానికి పూర్తిగా రెండుగంటలైనా వ్యవధిలేదు.

'పెందలికాడే బయలెళ్ళి నడిచేసినా అందేద్దువు. మరింకిప్పుడీల్లేదు. ఏళ్ళూ వూళ్ళూ ఏకవే మరింక.''

నడచివెళ్ళడానికి వీలుపడనందుకూడా హర్షం వెలిబుచ్చేడు దుకాణం తాత.

బాధింపబడుతూ అలానే కూర్చున్నాడు పురుషోత్తం. బొగ్గులకోసం పయనమైన కొడక ఇంకా రానేదని దుకాణంతాత విసుక్కుంటున్నాడు. పాకంతా తడిసి ముద్దయింది. చలి హెచ్చూ, చలిగాలి జోరూ అయేయి. పైన వర్షంపడుతోంది.

"పడకేటేచెస్ది బాబూ? దానిటయాం అది."

(ట్రెయిన్ రాడానికి రెండుగంటలైనా వ్యవధిలేదు. రెండుకోసులదూరం అలానే

(42-వ పేజీ చూడండి)



## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యనుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

అనుకోకుండా అతిథులు వచ్చినప్పుడు...





వారికి సాటిలేని సత్కారం

మిచెల్స్
# కిసాన్ పానీయాలు*
ఆరంజి స్క్వాష్ - లెమన్ స్క్వాష్ - లెమన్ బార్లీ.
ఆరంజి బార్లీ - మామిడి స్క్వాష్ - గ్రేప్ ఫ్రూట్
స్క్వాష్ - లైంజూస్ కార్డియల్ మొదలైనవి.




మధురమైన ఈ పండ్ల పానీయం వారి కెంత బాగుంటుందో మీరే తెలుసుకో వచ్చును మంచి పండ్ల రసాలతో చేయబడిన ఈ పానీయాలను సంవత్సరం పొడుగూన సేవింపవచ్చును. ఇవి మీ కుటుంబానికికూడ తగినవి. ప్రతి ఆదివారం తప్పకుండ తీసుకోండి. *ఎల్లప్పుడు ఒక సీసా ఇంట్లో ఉంచుకోవలెను.*

*ఫలములు, కాయల ఉత్పత్తులకు భారత ప్రభుత్వంచే జరుపబడిన అఖిలభారత ద్వితీయ పోటీ ప్రదర్శనంలో కిసాన్ తయారుచేసిన పానీయములకు ఒకటవ రెండవ బహుమతులు ఇవ్వబడినవి.

కిసాన్ ప్రాడక్ట్సు ప్రైవేట్ లిమిటెడ్, బెంగుళూరు


# వర్షం ★ (23 వ పేజీ తరువాయి)

ఉండిపోయింది. బస్సు ఎక్కడో ఆగి పోయింది. ఆకాశం విరుచుకు పడిపోతోంది. పురుషోత్తం లేచి నిల్చున్నాడు.

"నరమానవుడన్న వాడు బైట అడుగెట్టడానికి లేదు" రెస్టు లేనివాళ్ళా పురుషోత్తం అటూ ఇటూ తిరిగేడు. పని లేక గింజుకున్న వాళ్ళా గింజుకున్నాడు.

అగ్గుందా బాబూ?"

"లేదు"

"ఉండదనే అనుకున్నానే. నీట్లో అగ్గి పుట్టించాలగాని, మరి దొరకదు. ఈడు జూస్తే ఇంకా రానేదు. ఎక్కడ టిక్కడి పోసాడో ఏటో? గేటు కాణ్ణుండి బొగ్గులట్టుకొస్తానని పారెళ్ళాడు బాబూ. కుర్రోడేగాని కండసేసనమ్ముండకోడుకులే! ఒరసవేఁసన్నమాటేటి. దిమదిమలాడుతూ ఏనుగులు దిగేసినా సొక్కసెయ్యి," కుర్రవాడు వెళ్ళడం, బొగ్గులు తేవడం, ఏనుగులు దిగడం—వీటిగురించి వినడం లేదు పురుషోత్తం. చుట్టూ పాకంతా బందిఖానాలా అవుపిస్తోందతనికి. ఇనపఊచలు దిగ్గొడుతున్నట్టుగా వర్షధారలు చుట్టూ దిగుతున్నాయి. అతను ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. పరిస్థితులకి చిరాకుపడిపోతున్నాడు.

వెళ్లు వెళ్ళంటే వెళ్ళిపోయి వచ్చేడు తను. ముందు కలకత్తా వెళ్ళి అక్కడి పరిస్థితులు చూసుకొని ఆతరవాత వచ్చి పెళ్ళికూతుర్ని చూడవలసింది. ఎప్పుడూ ఇలాగే అవుతోంది. ఆపిల్ల కరెక్టుగానే ఆఖోక్కి కట్టినట్టుంది. ఛ! తనెప్పుడూ ఇంతే. కలకత్తా రావాలిస్మీ అన్నారు. ఒస్తున్నానన్నాడు. అడివిపాలెం పో అన్నాడు మావఁ. పోతున్నా నన్నాడు. చిన్నప్పటినుంచీ కూడా ఇంతే. చదువుకోకపోతే చెడిపోతావు, చదువుకో అన్నారు. చదువుకుంటానన్నాడు. బుద్ధిగా ఉండకపోతే బాగుపడవుస్మీ అన్నారు. బుద్ధిగా ఉంటానని లెంపలు వేసుకున్నాడు. మజాలేని వెధవలు మంచిగానే ఉంటారు మరి అన్నాడొక స్నేహితుడు. అవునవునని తను ఒప్పుకున్నాడు. ఇలాగే అన్నీను. ఈత రాకుండా నీట్లోకి దిగేవు జాగ్రత్త! "దిగను". దీపం లేకుండా చీకట్లో నడిచేవు జాగ్రత్త! "నడవను". చక్కని రాజమార్గాలుండ... సందులంట తిరిగేవు జాగ్రత్త "తిరగను" వాళ్ళలాచస్తే నీకెందుకు? వాళ్ళ జట్టీల్లోకి నువ్వు వళ్ళేవు జాగ్రత్త "వెళ్లను" అన్యాయం, అధర్మం! నీకేలదంతా? నీపని నువ్వుచూసుకో. లేకపోతే తన్నులు తగిలేను జాగ్రత్త! "అదంతా నాకెందుకు?!

ఆ తన్నులు నాకెందుకు? నావని నే చూసుకుంటాను." టైఫాయిడ్, న్యూమోనియా, మరేదో మరేదో ఏదైనా వస్తుంది. వర్షంలో చొరబడేవు జాగ్రత్త! "చొరబణ్నే. ఇక్కడే ఉంటాను."

తుళ్ళిపడ్డాడు పురుషోత్తం. మరి తే కలకత్తా వెళ్ళడం ఎలాగ? గంటన్నర కంటె మరింక టైమ్ లేదు. ఏం చెయ్యడానికీ పాలుపోక పురుషోత్తం మళ్ళీ బల్లమీద కూర్చోబోతూ వుండగా దుకాణంతాత చూరుకింద నించి రోడ్డువెపు చూసి "ఆ! ఒస్తడోస్తను చూడిగదీ! లేసుకుక్కి! పారా! పారా!" అని పుత్సాహంతో కేకలు వేసేడు. పురుషోత్తంకూడా వంగొని, చూరుకిందనుంచి చూసేడు.

ఎదురుగా తిన్నగా దూరానికి కనిపిస్తోంది రోడ్డు. రెండుపక్కలా ఉన్న చెట్లు సిపాయిల్లా నిల్చొని అలజడిచేస్తున్నాయి. రోడ్డంతా నీటితో ఏటికాలవలా ఉంది. అందుమీద ఆరని నిప్పుతునకలా, నీటిమీద తోటులా, చెట్లని చీల్చుకొని బాటవేసుకొని వస్తున్నట్టుగా ఓ కుర్రవాడు భుజాన్న మూటవేసుకొని పరిగెట్టుకొని కొట్కొస్తున్నాడు.

కుర్రవాడికి హుషారిచ్చినతరవాత దుకాణంతాత బుగ్గలు పూరించి పొయ్యి ఊది "ఆరిపోనాదనుకున్నాను. అనుందిరా బాబూ" అని ఇంకా జోరుగా ఊదడం ప్రారంభించేడు.

కుర్రవాడు పరిగెట్టి పరిగెట్టి పాకలోకి ఒక్కసారిగా విరుచుకుపడ్డాడు. "ఒచ్చేసినా తాతా" అని వచ్చీరావడంతో కేక వేసి, మూటనుండి భుజాన్ని సుళువుగా తప్పించి, బొగ్గులమూటని చక్కన కిందకి విసిరేడు. కుర్రవాడికి పన్నెండేళ్ళకి మించి ఉండదు వయుసు. సరిగ్గా రేచుకుక్కలాగే ఉన్నాడు. అర నిమిషంలో, జుట్టునుంచి నీటిని నొక్కేసి, బట్టల్నించి నీటిని పిండేసి ఆ పాకలో పాడిగా గంతులు వేసేడు.

"వారషంలో దార్లో సత్తే ఏటిజేద్దువురా మనవడా" అన్నాడు దుకాణంతాత, బొగ్గులమూట విప్పుతూ. మూట విప్పగానే రాతిసిబొగ్గులు నిగనిగ మెరిసేయి. "ఒరవా! మన వంగతేలేటి తాతా? ఒరసాన్ని వంటిడిసి పెడతా డీపోతురాజు" అని మూడు లోకాలూ ఏలేవాళ్లా జవాబు చెప్పి, పొయ్యి విసరడానికి విర్రవీగుతూ వెళ్ళేడు కుర్రవాడు.

ఆ పాకలో పాతుకుపోయినట్టుగా నిశ్చలుడై నిల్చుండిపోయేడు పురుషోత్తం. ఆకాశం ఒక్కసారి గప్పున మెరిసింది. అంతవరకూ పురుషోత్తాన్ని వెంటతరిమిన పెళ్ళికుమార్తె చూపు ఆ క్షణంలో అతని ముందుకొచ్చి మూర్తీభవించి నిల్చొంది. ఆమె చూచిన చూపు, ఆనాటి నర్సు నవ్విన లేనవ్వు; చిగిర్చిన మామిడిమొక్క, ఎగసిన కొబ్బరిచెట్టు; ఈదురుగాలి, హోరున వర్షం; నీటిలో నిప్పు, మనిషిలో జ్వాల-అన్నీ అతనికి అర్థమయేయి. అర్థయుక్తంగా, స్పష్టంగా తెరమీది కథలా అతనికంతా బోధపడింది. అంతా చూస్తూ అతనలా నిల్చుండిపోయేడు.

పైన వర్షపుధారలు స్తంభించినట్టుగా అలానే ఉండిపోయేయా అన్నట్టుగా అనిపిస్తోంది. ఆకాశం ఇంకా దట్టంగా మూసుకొంటోందే గాని పల్చబడ్డంలేదు. గుర్రాల్ని కట్టుకొని ఝామ్మని అన్నింటినీ తోసుక్కుపోతోంది ఈదురుగాలి. మెరుపులు పిడుగులయి అందినదాన్నల్లా హతమార్చేస్తున్నాయి. మబ్బులు కమ్మిన కొద్దీ పాకలో చీకటి చిక్కనవుతోంది.

పొయ్యి విసురుతూన్న కుర్రవాడు ఇనుంలా ఎర్రగా మెరుస్తూన్నాడు.

కొద్దిసేపయింది.

అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూన్న దుకాణంతాత ఏదో గుర్తుకొచ్చినట్టుగా టక్కున ఆగి, కళ్ళు చిట్లించి, అటూ ఇటూ చూసి, మనవణ్ని "పోతురాజోరే" అని పిల్చి "ఇప్పుడిప్పుడిక్కడున్నాడు! చిటిబాబెక్కడికి పోనాడ్రా?" అని ఆశ్చర్యపడుతూ, సిటీబాబుని ఎన్నమ్మకొని ఎత్తుకుపోయిందా?! అన్నట్టుగా అడిగేడు.

"అదుగో" అన్నాడు పోతురాజు.

"ఏడీ?"

"అదుగదుగదుగో" అని రోడ్డువైపు చూపించేడు పోతురాజు.

"ఏటి!! వప్పుముద్దనా సతికిలబడిపోన్డు; ఒరసం ఒగ్గనట్టు పాకొగ్గడనుకున్నాన్రోరే. ఆ! ఆ! దిల్నాడే!" అంటూ మోకాళ్ళు వంచి వీపు విరిచి చూర్లోంచి పైకి చూసేడు దుకాణం తాత.

ముసరచీకట్లో తిన్నగా సూటిగా, ఈదురుగాలి కెదురుగా, వర్షాన్ని సరకుచేయకుండా, తెరల్ని ఛేదించుకొంటూ చకచకా ముందుకి వెళ్తున్నాడు పురుషోత్తం. అతణ్ని చూసి తల పంకించి, హాసించి "సెబాసో" అని మెచ్చుకున్నాడు దుకాణం తాత. ★




చల్లనిపాలతో కలిపి
ఫ్రూటాల్
ఎల్లప్పుడు సేవించండి

తెల్ల వెంట్రుక లుండవు

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేదపద్ధతిలో తయారైనది 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. అదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞానశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక పీసా రు. 5; 3 పీసాలు రు. 12. సగము నెరసివుంటే ఒకసీసా రు. 6; 3 పీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 పీసాలు రు. 18/-లు పనిచేయ లేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి సూచీ.

INDRA AYURVED BHAVAN,
(A. P.) P.O Rajdhanwar (H. Bagb).

